ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 14 జూలై 2025



విద్యానగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు



బాపట్ల పురపాలక సంఘ కార్యాలయం

- అధ్వానంగా బాపట్ల పురపాలక సంఘం ఆర్థిక స్థితి
- అభివృద్ధి పనులకు నిధుల కొరత.. ఆదాయంపై అన్వేషణ
- పాలక మండలి ఏర్పడితేనే.. ఆర్థిక సంఘం నిధుల జత

ఎన్నికలే.. పరిష్కార మార్గం

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పురపాలక సంఘం ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారింది. వైసీపీ పాలనలో పురపాలక సంఘాన్ని నిర్వీర్యం చేశారు. 34 వార్డులు ఉన్న బాపట్ల మునిసిపాలిటీలో మరో 8 గ్రామ పంచాయతీలను విలీనం చేసి.. ఎన్నికలు నిర్వహించాలని చూశారు. దీనిని కొందరు ఆక్షేపిస్తూ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధులనూ కేంద్రం నిలిపివేసింది. ఫలితంగా రూ.3కోట్లకు పైగా నిధులు ఆగిపోయాయి. దీంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడింది. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం.. కనీసం వీధి దీపాలు మరమ్మతులు చేయాలన్న నిధులు లేక అధికారులు మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే.. బాపట్ల మునిసిపాలిటీకి ఎన్నికలు తప్పనిసరి. దీనికోసం స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో పాటు కూటమి నాయకులూ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలు జరిగితేనే ఆర్థిక సంఘం నిధులు వస్తాయి. ఆ తర్వాత అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా ముందుకెళ్లవచ్చు.

గుత్తేదారులకు నిలిచిపోయిన బకాయిలు


వైసీపీ పాలనలో నిధులు లేకపోయినా కాంట్రాక్టర్లను నమ్మించి, ఒప్పించి అనేక అభివృద్ధి పనులు చేయించారు. అందులో ముఖ్యంగా కర్లపాలెం రోడ్డు నుంచి విద్యానగర్‌లో హైవే లింకు రోడ్డు ఒకటి. ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణానికి అనేక కుటుంబాలను ఖాళీ చేయించారు. కాంట్రాక్టర్ రోడ్డు విస్తరించి.. మెటల్ వేసి డివైడర్ ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయాడు. అదేవిధంగా ఉప్పరపాలెం నుంచి జీబీసీ రోడ్డును కలుపుతూ రైల్వే ట్రాక్ పక్కనే రోడ్డు పనులు ప్రారంభించారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో అక్కడ పనులు కూడా నిలిచిపోయాయి. ఫలితంగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాలేదు. ఈ విధంగా చెప్పుకుంటూపోతే గత పాలకులు చేసిన తప్పిదాల వల్ల కాంట్రాక్టర్లకు రూ.15 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పురపాలక సంఘం సాధారణ నిధులు నుంచి కొద్దిపాటి బిల్లులు చెల్లిస్తున్నప్పటికీ.. ఇంకా బకాయిలు మిగిలే ఉన్నాయి.

ఆదాయంపై అధికారుల దృష్టి

పురపాలక సంఘం ఆదాయం పెంపుదలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పన్ను వసూళ్లు, కొత్త నిర్మాణాలకు పన్ను వేయడం ద్వారా ఆదాయం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇంత చేసినా రూ. 1.50 కోట్లు మాత్రమే ఆదాయం పెరిగే అవకాశం ఉంది. పన్ను చెల్లించేవారు మొత్తంగా ముందుకు రాకపోతే అదికూడా సాధ్యపడదు. పురపాలక సంఘం ఎన్నికలు జరిగి.. పాలక మండలి ఏర్పడితేనే ఆర్థిక సంఘం నిధులు వచ్చి సాధారణ నిధులతో కలిస్తే అభివృద్ధి జరుగుతుంది. దీనిపై పాలకులు, అధికారులు దృష్టి సారిస్తేనే బాపట్ల పట్టణ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది.

రుణ పరిమితి పెంపు

సాగు వ్యయం పెరిగిపోతోంది. కూలి నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వరకు ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. వ్యవసాయ రుణాలు ఖర్చులకు అనుగుణంగా లేవు. అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో రుణ పరిమితి పెంచాలని రైతులు అభ్యర్థిస్తున్నారు. వారి వినతులపై స్పందించిన ప్రభుత్వం రుణ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్, రబీ రెండు సీజన్లకు పంటల వారీగా రుణాలను నిర్ణయిస్తూ బ్యాంకర్లకు ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. తమ గోడు పాలకులు పట్టించుకుని రుణాల పెంపుదలతో అప్పుల తిప్పలు తప్పాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





- ఖరీఫ్, రబీ సీజన్లకు వర్తింపు
- రైతుల అభ్యర్థనకు ప్రభుత్వం స్పందన
- పంటల వారీగా రుణాలపై బ్యాంకర్ల ఆదేశాలు
- అప్పుల బాధలు తప్పాయని అన్నదాతల ఆనందం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సమీపించిన తరుణంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో బ్యాంకులు వార్షిక పద్దును ప్రకటించాయి. అయితే రుణ పరిమితి పెంచితే తమకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు అభ్యర్థించగా ప్రభుత్వం వారి గోడు ఆలకించి ఈ ఆర్థిక సంవత్సరంలో సేద్యానికి అందించే రుణాల విషయంలో పరిమితి పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంపు నిర్ణయం ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో వర్తింప చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను బ్యాంకులతో పాటు సహకార సంఘాలు కూడా పాటించాలని ప్రభుత్వం సూచించింది. వరికి సంబంధించి ఎకరా సాగుకు రుణ పరిమితి 46,000 ఉండగా దానిని ఖరీఫ్‌లో 52,000, రబీలో 55,000 వరకు పెంచింది. దీంతో పెట్టుబడి ఖర్చుల్లో సగటున రూ.7000 వరకు రుణం పెరగనున్నది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో నాలుగు లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. వర్ష ఆధారిత పొలాల్లో పత్తి విషయంలో గత ఆర్థిక సంవత్సరం రూ.46,000లు ఉండగా, దానిని రూ.51,000కు పెంచుతూ ప్రభుత్వ సూచన మేరకు బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. మిర్చి సాగుకు రుణ పరిమితి పెంపు నిర్ణయంతో దాదాపు లక్షన్నర మంది రైతులకు మూడు జిల్లాల పరిధిలో మేలు జరగనున్నది. ఉద్యాన పంటల సాగుకు కూడా రుణ పరిమితి పెంచారు. మొక్కజొన్న, కంది, శనగ, మినుము ఇలా దాదాపు ప్రతీ పంటకు రుణ పరిమితి పెంపు నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట(ఎకరా)	గతం	ప్రస్తుతం
వరి	46,000	52,000
పత్తి	48,000	55,000
పత్తి(వర్షాధారం)	46,000	51,000
మిర్చి	1,50,000	1,75,000
పచ్చిమిర్చి	90,000	1,10,000
అరటి	99,000	1,10,000

కొర్రీలు వద్దు.. ఉదారంగా వ్యవహరించాలి

వార్షిక పద్దులో వ్యవసాయానికి కేటాయించిన రుణాలలో ప్రతి పైసా రైతులకు చేరాలని బ్యాంకర్లకు ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వ్యవసాయ రుణాల విషయంలో రకరకాల నిబంధనలతో కొర్రీలు వేసే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని, సాధ్యమైనంత వరకు ఉదారంగా వ్యవహరించి రైతుల ప్రయోజనాలు కాపాడాలని సూచించింది. రుణాల పెంపు లేకపోగా సర్దుబాటుతోనే గతంలో ముగించేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఉండడానికి వీల్లేదని ప్రభుత్వం బ్యాంకులకు సూచించింది.

కుప్పడం చీరకు...

నేడే సత్కారం

- సాకారమైన చీరాల చేనేతల చిరకాల స్వప్నం
- ఢిల్లీలో అవార్డు అందుకోనున్న కలెక్టర్ వెంకటమురళి

చీరాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మహిళలకు గౌరవాన్ని దర్పాన్ని అందిస్తూ జాతీయ స్థాయి గుర్తింపు పొందిన చీరాల కుప్పడం చీర ఢిల్లీ వేదికగా సోమవారం సత్కారం అందుకోనున్నది. ఈ ఏడాది జనవరిలో చీరాలలో పర్యటించిన కేంద్ర బృందం కుప్పడం చీర ప్రాముఖ్యతను పరిశీలించింది. దీంతో కుప్పడం చీరకు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఢిల్లీలో కలెక్టర్ వెంకటమురళి అవార్డు అందుకోనున్నారు. చిరకాల స్వప్నం సాకారం కావడంతో చీరాలకు చెందిన నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గంపై చీరను తయారు చేస్తున్న కార్మికుడు



కుప్పడానికి ప్రత్యేక స్థానం..

నేత చీరల తయారీలో చీరాల చేనేతలకు ప్రత్యేక స్థానం ఉంది. ఎన్నిరకాల సంక్షోభాలు ఎదురైనా వాటిని అధిగమించి చేనేతకు చీరాల గుర్తింపు తెచ్చుకుంది. దేశంలో వివిధ ప్రాంతాల్లో కుప్పడం తయారవుతున్నా 5 అంగుళాల చీరలు మాత్రమే మార్కెట్లో ఉన్నాయి. ఆ సమయంలో చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలేనికి చెందిన చేనేత కార్మికుడు కూరపాటి సుబ్బారావు 20 ఏళ్ల క్రితం గద్వాల్‌కు కార్మికులను తీసుకెళ్లి కుప్పడం చీర నేతపై శిక్షణ ఇప్పించారు. ఆ తర్వాత అన్ని దగ్గర్ల చేసినట్లు 5 అంగుళాలతో కుప్పడం చీర తయారీ ఇక్కడ కూడా చేపట్టారు. ప్రస్తుతం 18 అంగుళాల బోర్డర్‌తో కుప్పడం చీరలు తయారు చేసేలా ఇక్కడి నేతన్నలు నైపుణ్యం సాధించారు. ప్రస్తుతం 5 వేల మగ్గాలు చీరాల పరిధిలో ఉన్నా వీరిలో రెండు వేల మంది మాత్రమే కుప్పడం తయారీ చేసే పరిస్థితి ఉంది. తొలుత కుప్పడం చీర సంక్షోభంలో చిక్కుకోగా జాండ్రపేటకు చెందిన సిద్ధి సత్యన్నారాయణ వెలుగులోకి తెచ్చారు. తాజాగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుప్పడం చీర విశిష్టతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకు తీసుకెళ్లారు. వారు చీర నాణ్యత, నేతన్నల శ్రమను గుర్తించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో జాతీయ స్థాయి గుర్తింపు పొందింది.

కుప్పడం ప్రత్యేకతలు ఇవి

చీరాల కుప్పడంలో 5 నుంచి 18 అంగుళాల అంచుతో చీర తయారు చేస్తున్నారు. నేతలోనే బోర్డరు కలిసి ఉండటంతో ప్రత్యేకత సంతరించుకుంది. నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా ఉంటూ మహిళలను ఈ చీరలు ఆకర్షిస్తున్నాయి.

ప్రత్యేక శిక్షణతో అభివృద్ధి

చీరాలలో కార్మికులు అధికంగానే ఉన్నారు. ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే అత్యాధునిక డిజైన్లు తయారు చేసేందుకు అవకాశం ఉంటుంది. బ్యాంకులు రుణ సాయం ఉండాలి. ఆధునిక యంత్రాల అవసరం కూడా ఉంది.

-సిద్ధి బుచ్చేశ్వరరావు, మాస్టర్ వీవర్

నేటి నుంచి కార్మెల్ మాత మహోత్సవాలు

- మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: ఫాతిమా మర్రెడ్డి

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

బాల శాస్త్రవేత్తలను ఇన్‌స్పైర్ చేద్దాం!

- 2025-26 ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబరు 15 వరకు గడువు

6

రోడ్లు, కాల్వలు.. అధ్వానం

- అవస్థలు పడుతున్న జగనన్నకాలనీవాసులు



18వ వార్డు జగనన్న కాలనీలో బురదమయంగా రోడ్డు

రేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 18వవార్డులో అరవై ఎకరాల్లో గత ప్రభుత్వంలో లేఅవుట్ వేశారు.. 2134 ఇళ్లు మంజూరు చేశారు.. 1300 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు.. అయితే ఇక్కడ రోడ్లు వేయలేదు. డ్రెయిన్లు నిర్మించలేదు. దీంతో జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు కల్పనలో అప్పటి జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఓ మోస్తరు వర్షానికి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. రాకపోకలకు కాలనీవాసులు అల్లాడుతున్నారు. డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయి. గృహాల చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఇటీవల కురిసిన వర్షానికి ఖాళీ ప్లాట్లలో, రోడ్లపై నీరు నిలిచిపోయింది. మురుగునీరు పారుదల పెద్దసమస్యగా మారింది. కొన్ని ఇళ్లకు మాత్రమే తాగునీటి కుళాయిలు ఉన్నాయి. మిగిలిన వారు తాగునీటిని వాటర్ ప్లాంట్లు ద్వారా కొనుగోలు చేసుకుని తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రణాళిక లేకుండా చేపట్టిన నిర్మాణాలతో అల్లాడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.



అధ్వానంగా మారిన డ్రెయిన్

ఎత్తిపోతలు.. నిరుపయోగం

- మరమ్మతులకు నోచుకోని పథకాలు
- గుండ్లకమ్మలో నీరున్నా బీళ్లుగా పొలాలు

అద్దంకి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గుండ్లకమ్మ నిండుకుండలా ఉంది. అయినా సాగునీటి కోసం రైతులకు కష్టాలు తప్పడంలేదు. ఎత్తిపోతల పథకాల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీంతో రైతులకు సాగునీరు అందక పొలాలను బీళ్లు మార్చేసుకున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ వైసీపీ హయాంలో గేట్లు కొట్టుకుపోయాయి. దీంతో అప్పటి నుంచి ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయి. దీంతో అవి మరమ్మతులకు గురయ్యాయి. నిరుపయోగంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గత ఏడాది గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లు బిగించింది. దీంతో మండు వేసవిలో కూడా ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉంది. అయితే ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుండ్లకమ్మ నీరు రైతులకు ఉపయోగపడటంలేదు. అద్దంకి మండలం పార్వతీపురంలోని శ్రీసత్యసాయి ఎత్తిపోతల పథకం మూడేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. నెల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు పగలకొట్టడంతో తిమ్మాయపాలెం ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారింది. శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం తరచూ మరమ్మతులకు గురవుతుంది. మూడు ఎత్తిపోతల పథకాలకు తక్షణ మరమ్మతులు చేపట్టకపోతే ఈ ఏడాది కూడా 5 వేల ఎకరాలు ఆయకట్టులో సాగుకు నీటి విడుదల ఉండదని, రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఖాళీగా ఉన్న పార్వతీపురం ఆయకట్టులోని పొలాలు



ఎత్తిపోతల జరగని తిమ్మాయపాలెం పథకం



బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో జీడీసీఎంఎస్ బ్రాంచ్ నందు విక్రయిస్తున్న వరి ధాన్యం బస్తాలు

విత్తన విక్రయం వేగవంతం

- ఖరీఫ్ వరి సాగుకు రైతులు సమాయత్తం
- అందుబాటులో అన్ని రకాల విత్తనాలు

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. అరకలు దించి.. పొలాలు దుక్కుదున్ని విత్తుకు సిద్ధం చేస్తున్నారు. వరినారుమడులు సిద్ధం చేసి నీటి కోసం కాల్వల వైపు చూస్తున్నారు. మరికొందరు రైతులు వెద సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వెద సాగుతో దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతోపాటు పెట్టుబడి తగ్గుతుందని ఆ వైపు గా మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం, పరిశోధనా స్థానం విత్తనాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నారు. ఇంకా రైతులకు అవసరమైన బీపీటీ 5204 విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తున్నారు.

అందుబాటులోని వరి విత్తనాలు

బాపట్ల నియోజకవర్గంలోని మండలాలు.. బాపట్లలో 29,805, కర్లపాలెంలో 15,250, పిట్టలవానిపాలెంలో 12,256 ఎకరాల సాధారణ విస్తీర్ణం ఉంది. బాపట్ల వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో జీడీసీఎంఎస్ పాయింట్ ద్వారా సరిపడా విత్తనాలు విక్రయిస్తున్నారు. ఇక్కడ రైతులకు ఎంటీయూ-1262, 1224, 1282, బీపీటీ-5204, 2270, ఎన్ఎల్ఆర్-33892 రకాల వరివిత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 25 కిలోల బ్యాగ్ రూ.1,140 చొప్పున విక్రయిస్తున్నారు.

అన్ని రకాల విత్తనాలు..



రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. స్వల్పకాలిక రకాలతోపాటు దీర్ఘకాలిక రకాలైన ఎన్ఎల్ఆర్-33892, బీపీటీ-2270 రకాలు కూడా విక్రయిస్తున్నారు. వీటి పంట కాలం 165 రోజులు ఉంటుంది. ఆర్ఎస్కేల ద్వారా రైతులకు బీపీటీ-5204 రకం అందిస్తున్నాం. రైతుల అవసరాలను బట్టి మరిన్ని విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తాం.

-కె.ధనరాజు, ఏడీఏ

క్రీడా గాయాలకు..
ఆర్థ్రోస్కోపీతో చక్కటి పరిష్కారం

● ప్రముఖ సర్జన్ శివకుమార్ మామిళ్లపల్లి
● గుంటూరులో ముగిసిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రమణ యశస్వి. చిత్రంలో ప్రముఖ సర్జన్ శివకుమార్

గుంటూరు మెడికల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అయ్యే తీవ్రమైన భుజం, మోకీలు గాయాలకు సమర్థవంతమైన ఆర్థ్రోస్కోపీ సర్జరీ అందించవచ్చని గుంటూరు ఆర్థ్రోస్కోపీ సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, ప్రముఖ శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి ఆర్థ్రోస్కోపీ సదస్సులో ఆయన ప్రసంగించారు. తొలుత ముఖ్య అతిథి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి జ్యోతి ప్రజ్వలన గావించి, సదస్సును ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితుల్లో లిగమెంట్ టేర్ వంటి గాయాలతో పాటు టెన్నిస్ ఎల్బో వంటి స్పోర్ట్స్ ఇంజ్యూరీస్‌కు ఆర్థ్రోస్కోపీ సర్జరీ ద్వారా చక్కటి పరిష్కారం లభిస్తుందని డాక్టర్ శివకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన పలువురు వైద్య నిపుణులు ఈ సదస్సులో పాల్గొని లైవ్ సర్జరీలు నిర్వహించడమే కాకుండా వర్క్ షాప్ కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్థ్రోస్కోపీలో నూతన వైద్య చికిత్సలు, టెక్నిక్‌లను యువ వైద్యులకు వివరిస్తారని వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ గతంలో ఇటువంటి ఆర్థ్రోస్కోపీ కాన్ఫరెన్స్‌లు మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే జరిగేవన్నారు. ఇప్పుడు గుంటూరులో మొదటిసారిగా నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి డాక్టర్ గంటా చైతన్య మాట్లాడుతూ దేశంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఆర్థ్రోస్కోపీ సర్జన్లు ఈ సదస్సుకు హాజరై యువ వైద్యులకు మెళకువలు నేర్పుతున్నట్లు తెలిపారు. గుంటూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 180 మంది ఆర్థ్రోస్కోపీ/ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొని, సర్జికల్ స్కిల్స్‌ని పెంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఆర్థ్రోస్కోపీ సీఎంఈ కార్యక్రమానికి రెండు సీఎంఈ క్రెడిట్ అవర్స్ కేటాయించింది.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

గుంటూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఈ సమీక్షకు ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 551.10 అడుగులు ఉంది. ఇది 212.20 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1650 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లోగా 1650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 63,317 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



ఉద్యోగావకాశాలు

➙ గుంటూరు సిటీలోని ప్రముఖ కొటక్ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలసి పనిచేయుటకు విశ్రాంత ఉద్యోగులు 10th పాస్, 50 సం॥పై వయస్సు వారు కావలెను. సంప్ర॥ 99899 09698. AJG-239520

➙ గుంటూరులోని ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు 20 సంవత్సరాల లోపు వయస్సు గల ఆఫీస్ బాయ్, 30 సంవత్సరాల లోపు వయస్సు గల కార్ డ్రైవర్ మరియు పని మనిషి కావలెను. సంప్ర॥ 9703777458. AJG-238774

➙ ఏరీస్ ఆగ్రో లిమిటెడ్, ముంబాయి (CMPL Area) లో పని చేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ ఎక్జిక్యూటివ్ ట్రైనీ కావలెను (experience / fresher) అర్హత : ఏదైనా డిగ్రీ మరియు వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును. Interview : గుంటూరు ఆఫీసు. Ph : 9248724777, 9963111817. SJAA-147

ఉచిత జాబ్ ట్రైనింగ్

➙ తెనాలిలోని వైష్ణవి విద్యా సంస్థలో 3 నెలలు ఉచిత హాస్టల్ వసతి, జాబ్ ట్రైనింగ్ ఇచ్చి జాబ్ ప్లేస్‌మెంట్ ఇవ్వబడును. అర్హత : 10th పాస్ ఆసక్తి ఉన్న వారు సంప్రదించండి సెల్ నెం : 9290769284, 9701399994 AJG-239366

రియల్ ఎస్టేట్

➙ గుంటూరు జిల్లాలో శ్రీభ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మన్నెం లతీష్ గౌడ్. Ph : 9848986831. SJAA-142

PLOT FOR SALE

➙ పేరేచర్ల NH-167AGకు ఆనుకొని ORR మరియు అనంతపురం Ex.Hyway అతి సమీపంలో NRI Engineering College ప్రక్కన Spot Registion Plots కలవు. Call : 9490193255. RK-644

గోల్డ్ ఫైనాన్స్

బంగారం కొనబడును

➙ బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999 AJB-209455

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న **ఆంధ్రజ్యోతి**కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!



ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెబితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్నా యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ల	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	91103 23914
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	97048 67908
చీరాల	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్: 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

బాల శాస్త్రవేత్తలను ఇన్‌స్పైర్ చేద్దాం!

- 2025-26 ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్ నమోదుతో ప్రాజెక్ట్ నమూనాల ఎంపిక
- సెప్టెంబరు 15 వరకు గడువు
- ఎంపికైన ప్రతి ప్రాజెక్ట్‌కు రూ.10 వేల ప్రోత్సాహం
- జాతీయ స్థాయిలో రాణిస్తే.. మరెన్నో ప్రయోజనాలు
- తరగతి గదిలోనే పరిశోధనలకు పునాది

నరసరావుపేట కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆడిటోరియంలోకి వెళ్తాం. అంతా చీకటిగా ఉంటుంది. ఖాళీ సీటు ఎక్కడుందో తెలియదు. ఈ సమస్యకు పరిష్కారంగా మహారాష్ట్రకు చెందిన నీరజ్ పసుపులే అనే విద్యార్థి ఒక ఇండికేటర్‌ను కనుక్కున్నాడు. ఈ ఇండికేటర్‌ను సీటుకు అమర్చడంతో సులభంగా గుర్తించవచ్చు. వీధిలోని చెత్తకుండి నిండి పోయి పక్కన పడిన వ్యర్థాలతో అక్కడి వాతావరణం అపరిశుభ్రంగా మారుతుంది. డయ్యుడామన్‌కు చెందిన చిన్నారులు ప్రేమ్ అంకుష్, శివాని ఈ సమస్యకు పరిష్కారంగా ఒక పరికరాన్ని కనుగొన్నారు. కుండీలో చెత్త నిండగానే పరికరం సాయంతో చెత్త సేకరించే వాహనానికి తెలుస్తుంది. ఇలా నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు సులువైన పరిష్కారాలను చిన్నారుల నుంచి రాబట్టి వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల పేరుతో విద్యార్థులను పరిశోధనలపై మళ్లించేలా కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి దరఖాస్తులను కోరుతోంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి లక్ష ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కోదానికి రూ.10 వేల ప్రోత్సాహమందిస్తోంది. విద్యాశాఖ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు.

ప్రాజెక్టు ఎలా ఉండాలంటే..

తక్కువ ఖర్చులో పర్యావరణహితంగా ప్రాజెక్ట్ నమూనా ఉండాలి. ఎక్కువ మందికి ప్రయోజనకారిగా, సులభమైన నిర్వహణ విధానం, మెరుగైన పనితీరు కలిగి ఉండాలి. సృజనాత్మకతతో స్థానిక సమస్యలకు పరిష్కారం చూపాలి. తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. ప్రతి తరగతి నుంచి ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి.. అందుకు తగ్గట్టుగా ప్రాజెక్టును రూపొందించుకోవాలి.

వెబ్‌సైటులో నమోదు ఇలా..

ముందుగా ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థి సమాచారంతో పాటు అతని బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆధార్ నంబరు నమోదు చేయాలి. ఎంచుకున్న ప్రాజెక్టుపై 300 పదాల్లో సంక్షిప్తంగా వివరాలు అప్‌లోడ్ చేయాలి. ప్రాజెక్ట్ నమూనా ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.10 వేల ప్రోత్సాహకం ఇస్తారు. అక్కడి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ప్రదర్శనల్లో పాల్గొని.. జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలు తమ ప్రాజెక్టును మెరుగుపరుచుకునేందుకు శాస్త్ర, సాంకేతిక శాఖ మరో రూ.25వేల నిధులు అందిస్తుంది. జాతీయస్థాయిలో ఎంపికైన ప్రాజెక్టు నమూనా లు రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే ప్రదర్శనలో ఉంచుతారు. అలాగే జపాన్ దేశం సందర్శించే అవకాశం లభిస్తుంది. ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభిస్తుంది. సెప్టెంబర్ 15వ తేదీతో ఆన్‌లైన్ నమోదు గడు వు ముగుస్తుంది. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించవచ్చు.

విద్యార్థుల సృజనాత్మకతకు వేదిక
ఎల్.చంద్రకళ, డీఈవో, పల్నాడు

ఇన్‌స్పైర్ మనక్ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత ప్రదర్శనకు ఒక చక్కని వేదిక. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా సైన్సు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ప్రాథమిక పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాలల నుంచి 5 ప్రాజెక్టులు తప్పని సరిగా నమోదు చేయాలి. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలి.

ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలి
ఎం.రాజశేఖర్, డీఎస్‌వో, పల్నాడు

విద్యార్థుల్లోని అంతర్గత సామర్థ్యాన్ని, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇదో అద్భుత అవకాశం. ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి. బాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్దాలి.

నేటి నుంచి కార్మెల్ మాత మహోత్సవాలు

● మూడు రోజులపాటు ఘనంగా నిర్వహణ ● అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: ఫాతిమా మర్రెడ్డి

ఫిరంగిపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా రోమ్‌గా పిలవబడుతున్న ఫిరంగిపురంలో సోమవారం నుంచి కార్మెల్ మాత ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. వరుసగా మూడు రోజుల పాటు మంగళ, బుధవారాల్లో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు వందలాది మంది భక్తులు తరలి రానున్నారు. గ్రామంలోని కొండపై 1891లో వేంచేసిన కార్మెల్ మాతను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు. జీసెస్ తల్లి మరియమ్మకు మరో పేరే కార్మెల్ మాత. క్రీస్తు పూర్వం 857లో ఆహబు రాజు పాలనలో పాలస్తీన దేశంలో అనావృష్టి వల్ల కరువు సంభవించింది. దీనిపై ఏలియా అనే దీర్ఘదర్శి కార్మెల్ పర్వత గుహలో ప్రార్థించగా.. ఆకాశంలో కారు మేఘాలు కమ్మి కుంభ వృష్టిగా వర్షం పడింది. దీంతో పంటలు సమృద్ధిగా ఫలించి కరవు తొలగింది. కావున కార్మెల్ పర్వతం ప్రశాంతతకు, పవిత్రతకు నిలయంగా మారింది. ఫిరంగిపురంలోని కార్మెల్ మాత కొండ కూడా అంతే ప్రసిద్ధి చెందింది. దీంతో 1001 మెట్లు ఉన్న ఈ ఎత్తయిన కొండను భక్తులు అవలీలగా ఎక్కుతుంటారు. లండన్ మిల్‌హిల్‌కు చెందిన ఫాదర్ థియోడర్ డిక్మన్ 1891లో కార్మెల్ మాత దేవాలయాన్ని కొండ మీద నిర్మింపజేశారు. 1922లో పర్మన్ స్వామి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. 1980లో ఫాదర్ డీసీఎల్ పూదోట ఇన్నయ్య యాత్రికుల కోసం వసతి గృహం, మెట్ల బాట వెంట విద్యుత్ సదుపాయం, ప్రదర్శనశాల, నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. అలాగే కొండ మెట్ల వెంబడి 14 స్థలాలను ఏర్పాటు చేశారు. 1933లో మరియదళం, సొడాలిటీ సభ ఏర్పాటైంది. భక్తులు తమ మొక్కులను తీర్చుకొని.. వారి గ్రామాలకు చేరేలోగా వర్షాలు పడి విత్తనాలు వేసుకొని వ్యవసాయాన్ని ప్రారంభించే ఆనవాయితీ ఉంది.



ఫిరంగిపురంలో కొండపై కార్మెల్ మాత దేవాలయం

వీటితో పాటు గ్రామంలోని ప్రధాన కూడళ్లలో కార్మెల్ మాత, మరియ మాత, సృష్టికర్త మాత, జీసెస్‌ల మందిరాలు అనేకం వెలిశాయి. వీటి నిర్మాణాల వల్ల గ్రామం ఆధ్యాత్మికతతో విరాజిల్లుతోంది.

పండగకు అన్ని ఏర్పాట్లు చేశాం : ఫాతిమా మర్రెడ్డి, చర్చి ఫాదర్

రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే గురువులు, కన్యా స్త్రీలు, భక్తులకు బస, తాగు నీటి సౌకర్యం కల్పించామని బాల ఏసు చర్చి ఫాదర్ మాలపాటి ఫాతిమా మర్రెడ్డి తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా..పోలీసు శాఖతో సంప్రదించి అదనపు బలగాలను రప్పిస్తున్నట్లు వెల్లడించారు. పండగ కరపత్రాలు, వాల్ పోస్టర్లు అన్ని చర్చిలకు పంపామన్నారు. భక్తులకు రెండు రోజుల పాటు అన్నదానం కూడా చేస్తున్నామని ఆయన తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

తెనాలి రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): గంజాయికి బానిసలై.. దానినే వ్యాపారంగా మార్చుకున్న ముఠాను రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం రూరల్ కార్యాలయంలో సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్ విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. తెనాలి మండలం కఠెవరం గ్రామానికి చెందిన ముక్కాల ప్రకాశరావు, పెదరావూరు గ్రామానికి చెందిన దర్శి ప్రదీప్ కుమార్, చినపరిమికి చెందిన నలిగల శివనాగరాజు, తెనాలికి చెందిన మెరుగుమాల ప్రశాంత్‌కిరణ్ నలుగురూ వ్యసనాలకు బానిసలయ్యారని తెలిపారు. ఈ క్రమంలోనే విజయవాడకు చెందిన ఇమ్మానుయేలు అనే వ్యక్తిని పరిచయం చేసుకుని.. అతడి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో కొంత సేవిస్తూ మిగిలిన దానిని చిన్న ప్యాకెట్లలో తెనాలి, పరిసర గ్రామాలు, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. జగ్గడిగుంటపాలెం సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో దాడులు జరిపామన్నారు. నలుగురినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 10 వేలు విలువ జేసే కేజీ 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేశామని, వీరిలో మెరుగుమాల ప్రశాంత్ కిరణ్‌పై త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు ఉందని ముక్కాల ప్రకాశరావుపై విశాఖ, రాజ మహేంద్రవరం జిల్లాల్లో గంజాయి కేసులు ఉన్నాయని వివరించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్

9 మంది జూదరుల అరెస్టు

కారుమంచి(శావల్యాపురం)జూలై13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి గ్రామ సమీపం సపోటా తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శావల్యాపురం ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తన సిబ్బందితో కలసి ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,54,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. సోమవారం వినుకొండ కోర్టులో నిందితులను హాజరు పరచనున్నట్లు తెలిపారు. కారుమంచి సమీపంలోని పొలాల్లో వివిధ జిల్లాలకు చెందిన వ్యక్తులు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని, భారీ మొత్తంలో నగదు చేతులు మారుతున్నట్లు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి, అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

తొలి అడుగులో ఎమ్మెల్యే బూర్లకు నిరసన సెగ

● అన్నవరంలో కార్యకర్తల బాహాబాహి ● పాలపర్రులో వాటర్ ప్లాంట్‌పై రభస

పెదనందిపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు పెదనందిపాడు మండలంలో తెలుగు తమ్ముళ్ల నుంచి నిరసన సెగ తగిలింది. పార్టీలో సముచిత స్థానం కల్పించడం లేదంటూ ఓ వర్గం, పార్టీలో కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని మరో వర్గం ఎమ్మెల్యే ఎదుట బాహాబాహీకి దిగారు. డ్వాక్రా మహిళలు సైతం ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడుతున్న వీవోఏను తొలగించాలని ఎమ్మెల్యే కార్యాలయం, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అతీగతి లేదంటూ మండిపడ్డారు. ఈ విధంగా ఎమ్మెల్యే బూర్ల అడుగు పెట్టిన ప్రతి గ్రామంలోనూ ఆయనకు నిరసనలతో పాటు సమస్యలు ఆయనను చుట్టుముట్టాయి. కార్యకర్తలకు న్యాయం చేస్తానని, సమస్యలు చూసి భయపడే వ్యక్తిని కాదని.. సమస్యలను ఈ విధంగా రోడ్డెక్కించడం మంచిది కాదని, కూర్చుని పరిష్కరించుకోవచ్చంటూ ఎమ్మెల్యే రామాంజనేయులు కార్యకర్తలకు సర్ది చెప్పుకుంటూ వచ్చారు. అన్నవరంలో అడుగు పెట్టిన ఎమ్మెల్యేపై.. ఎప్పటి నుంచో పార్టీలో పనిచేస్తున్న తమకు న్యాయం చేయడం లేదని, కొత్తగా వచ్చిన వారిని అందలం ఎక్కిస్తున్నారని, కార్యాలయానికి వచ్చినా విలువ ఉండటం లేదంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పలు కమిటీల్లో కూడా సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ వాపోయారు. అలాగే పాలపర్రులో అవినీతికి పాల్పడుతున్న వీవోఏను తొలగించాలని డ్వాక్రా మహిళలు ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. సీపీఎం, పలు పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. గ్రామంలో వైసీపీ నాయకుడు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లి.. దానిని టీడీపీ వారికి అప్పగించే యత్నం చేశారు. అయితే నిర్వాహకుడు పంచాయతీ అనుమతితో ఆరేళ్లుగా ప్లాంటు నిర్వహిస్తున్నానని, అవసరమైతే పంచాయతీకి అప్పగిస్తానని తెగేసి చెప్పడంతో.. ఎమ్మెల్యే ఆగ్రహించారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, వెంటనే వాటర్ ప్లాంట్‌ను స్వాధీనపరుచుకోవాలని అధికారులను ఆదేశించారు.



పథకాలు అందడం లేదంటూ ఎమ్మెల్యేకు వివరిస్తున్న గ్రామస్తులు

విజయేశ్వరి.. బగళాముఖి



పిట్టలవానిపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చందోలు బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కు బడులు తీర్చుకున్నారు. సకల విజయాలు ప్రసాదించే విజయేశ్వరి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఈఓ జి.నరసింహమూర్తి తెలిపారు.

తెలుగు వారి హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నకరికల్లు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల హృదయాల్లో ఎన్‌టీ రామారావు చిరస్థాయిగా నిలిచి పోతారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలసి టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం సభలో కన్నా మాట్లాడుతూ టీడీపీని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి తెచ్చి రాజకీయాల్లో ఎన్‌టీఆర్ చరిత్ర సృష్టించారన్నారు. సినీ రంగంలోనే కాక రాజకీయ రంగంలోనూ ఎన్టీఆర్ యుగ పురుషుడిగా నిలిచారన్నారు. ఎన్‌టీఆర్ తర్వాత చంద్రబాబు టీడీపీని, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడుపుతున్నారని కొనియాడారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అధికారానికి దూరం చేసిన ప్రజలకు కన్నా కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ వందేళ్లయినా ప్రజల్లో ఎన్‌టీఆర్‌ది చెరగని ముద్ర అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, దరుపూరి నాగేశ్వరరావు, వేల్పుల ఆవుల రాజు, క్రాపా హరికృష్ణ, షేక్ అలీ బాషా, శ్రీను, మానం వెంకటేశ్వర్లు, అంకాళ్ళ ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

చిరుమామిళ్ళలో రేషన్ బియ్యం పట్టివేత

నాదెండ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో శనివారం రాత్రి సుమారు వంద బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలోని శ్రీ వినాయక డ్వాక్రా మహిళా సంఘం పేరుతో పోతిరెడ్డి మల్లేశ్వరి షాపును నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన దగ్గెంపూడి రామిరెడ్డి జాయింట్ కలెక్టర్‌కు రేషన్ బియ్యం నిల్వలపై ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాల మేరకు ఆర్ఐ సంతోషి కుమారి, వీఆర్వో ప్రేమ్‌రాజ్‌లు షాపును తనిఖీ చేశారు. రికార్డులో కంటే నిల్వ ఎక్కువగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఈ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులకు ఇస్తామని ఆర్ఐ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట/రెంటచింతల జూలై 13 (ఆంధ్రజ్యోతి):పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 15.40టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 4,600 క్యూసెక్కుల పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు లీకుల ద్వారా.. మొత్తం ఐదువేల క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

8,700 క్యూసెక్కుల నీరు విడుదల

సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1 ఎంయూ(మిలియన్ యూనిట్) విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ వేంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. రేడియల్ క్రస్ట్ గేట్లన్నీ మూసి వేసినట్లు వెల్లడించారు. టేల్ రేస్ చానల్ ద్వారా పులిచింతలకు 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రిజర్వాయర్‌లో 6.711 టీఎంల నీరుండగా.. ఇది 245.93 అడుగులు, 74.96 మీటర్లకు సమానమన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	205.00

సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB TRUST AND EXCELLENCE SINCE 1904
క్రెడిట్ రికవరీ మరియు మేనేజ్‌మెంట్ శాఖ
పరిపాలనా కార్యాలయము : నం. 24-B, గాంధీనగర్, కుంబకోణం - 612001.
ఇ-మెయిల్ ఐడి: crmd@cityunionbank.in,
ఫోన్ : 0435-2432322, ఫ్యాక్స్ : 0435-2431746

SARFAESI చట్టం 2002 క్రింద రీ-టెండరు - సహిత - వేలం అమ్మకం ప్రకటన

రుణగ్రహీతలు/హామీదారులు : నం 1) శ్రీ తోట రమేష్ బాబు, తండ్రి తోట వెంకటేశ్వర్లు, డి.నం.2-81, 10వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట హెచ్/ఓ, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616, నం 2) శ్రీమతి తోట రమాదేవి, భర్త తోట రమేష్ బాబు, డి.నం.2-81, 10వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట హెచ్/ఓ, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616, నం 3) శ్రీ తోట వెంకట వృద్ధి, తండ్రి తోట రమేష్ బాబు, డి.నం.2-81, 10వ లైన్, పండరీపురం, చిలకలూరిపేట హెచ్/ఓ, పురుషోత్తపట్నం, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522616ల నుండి 03-05-2025 నుండి చార్జి చేయబడే తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు, బ్యాంకుకు రావలిసిన ఏమేని ఇతర బకాయితో కలిపి 02-05-2025 నాటికి రూ. 1,47,90,322/- (రూపాయలు ఒక కోటి నలభై ఏడు లక్షల తొంభై వేల మూడు వందల ఇరవై రెండు మాత్రమే) లను రాబట్టుకొనుటకు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూలు 8(6) & 9 క్రింద, SARFAESI చట్టం 2002 క్రింద సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్‌కు తనఖా పెట్టిన దిగువ ఆస్తి / ఆస్తులు బ్యాంక్ అధీకృత అధికారిచే రీ-టెండరు-సహిత-బహిరంగ వేలంలో విక్రయించబడును.

మా బ్యాంకుకు తనఖా పెట్టబడిన స్థిరాస్తి
(శ్రీమతి తోట రమాదేవి, భర్త తోట రమేష్ బాబుకు చెందిన ఆస్తి)
గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, చిలకలూరిపేట సబ్-జిల్లా, చిలకలూరిపేట మునిసిపాలిటీలో గల బ్లాక్ నం.2 (డోర్ నం.2-81 దగ్గర) రీ-సర్వే డి.నం.162/2 పై పురుషోత్తపట్నం గ్రామ డి.నం.162లో స్థలం 527.97 చ.గ.ల విస్తీర్ణంలో భూమి యావత్తు. సరిహద్దులు: తూర్పు: పావులూరి రాధాకృష్ణ మూర్తి, స్థలం-41 1/2 అడుగులు. దక్షిణం: తోట రవిబాబు స్థలం-110 అడుగులు. పశ్చిమం: నడవ స్థలం- 41 1/2 అడుగులు. ఉత్తరం: తోట రాజశేఖర్ స్థలం-119 అడుగులు.

రిజర్వు ధర: రూ 1,20,00,000/-
(రూపాయలు ఒక కోటి ఇరవై లక్షలు మాత్రమే)

రీ-వేలం వివరాలు	
రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం తేది :	ప్రదేశం
06-08-2025	సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ, 7-376/1, గాంధీపేట,ఎన్ఆర్‌టి సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ -522 616. టెలిఫోన్ నం. 08647-257444, సెల్ నం. 9398314148.

రీ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, చిలకలూరిపేట శాఖ,7-376/1, గాంధీపేట,ఎన్ఆర్‌టి సెంటర్, చిలకలూరిపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ -522616. వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్డను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్డను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం. 08647-257444, సెల్ నం. 9398314148. లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదీన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలపరిమితిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏమేని చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్డను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 11.07.2025 అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN-L65110TN1904PLC001287.
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

భారతీయ సంస్కృతి విస్తరణలో ఉపాధ్యాయుల పాత్ర ఊపిరి వంటిది

● తాళ్ళాయపాలెం శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి వైభవాన్ని విస్తరింప చేయటంలో ఉపాధ్యాయపాత్ర సమాజానికి ఊపిరి వంటిదని తాళ్ళాయపాలెం శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి అన్నారు. పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీకళ్యాణ మండపంలో హిందూ ఉపాధ్యాయ సమితి వ్యాసమహర్షి పురస్కారాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వేద జ్ఞానాన్ని ధరిత్రిపై బోధించి జ్ఞానసంపదను ప్రసాదించిన వేదవ్యాస మహర్షి జ్ఞానసంపదకు తొలి గురువు అని అన్నారు. వ్యాసమహర్షిని స్ఫూర్తిగా తీసుకున్న హిందూ ఉపాధ్యాయసమితి ఉపాధ్యాయులు సమాజంలో విజ్ఞాన సౌరభాలు వెదజల్లుతూ భారతీయ సంస్కృతికి సేవలందిస్తున్నారన్నారు. ఆధ్యాత్మిక, రక్షణ, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతదేశం మహోన్నతమైన అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, హిందూ ఉపాధ్యాయ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల, ఉపాధ్యక్షుడు డోకుపర్తి సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షుడు డీవీవీఎస్ఎస్ ఎన్.మూర్తి, స్వర్ణ ఫణి అజయ్‌శర్మ, రాష్ట్ర మాతృశక్తి ప్రధాన కార్యదర్శి చారులత, వేణు మాధవ్, సుబ్రహ్మణ్యం, రమాదేవి, సాంబశివరావు, ఎల్‌వి.సుబ్బారావు, సత్యనారాయణ, శంకరయ్య, ఉమామహేష్, వేముల ప్రసాద్, నాగరమేష్, రామచంద్, రాధాకృష్ణ, ఉషా కిరణ్, ఉదయలక్ష్మి, చంద్రకిషోర్, శ్రావణకుమార్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పురస్కారాలు పంపిణీ చేశారు.



కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న తాళ్ళాయపాలెం శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి

శ్రీమహర్షి ఆశ్రమ గోశాలకు పీఠాధిపతి శివస్వామి

బాపట్లరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీమహర్షి ఆశ్రమ గోశాలకు ఆదివారం పీఠాధిపతులు శ్రీ శివస్వామి విచ్చేశారు. ఆశ్రమ నిర్వాహకులు స్వామివారికి పండ్లు, పూలతో సత్కరించి అనంతరం ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బాబునాగేంద్ర, మామిడి రాజశేఖర్, పద్మావతి, బుర్ల భాగ్యలక్ష్మి, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, పట్టణాధ్యక్షులు బాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కర్లపాలెం రోడ్డులో వెలగని సెంట్రల్ లైటింగ్

అంధకారంలో బాపట్ల

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఒక్కసారిగా పట్టణంలోని వీధి దీపాలు వెలిగించేవారు లేకపోయారు. ప్రధాన రహదార్లపై డివైడర్‌ల మధ్య ఏర్పాటు చేసిన లైట్లు, స్తంభాలకు ఆర్భాటంగా అలంకరించిన జాతీయ జెండా రంగులతో కూడిన లైట్లు కూడా వెలగటంలేదు. దీంతో పట్టణమంతా ఆదివారం రాత్రి అంధకారంగా మారింది. పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో ఉన్న లైట్లు కూడా వెలగలేదు. శివారు ప్రాంతాలలోని జగనన్నకాలనీలలో వీధిదీపాలు వెలగక ప్రజలు అంధకారంతో అల్లాడుతున్నారు. రాత్రులు విషపురుగులు ఇళ్ళల్లోకి వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం ఫోన్‌లు పనిచేయకుండా ఉంచారు. సమ్మెకు వెళుతామని కార్మికులు కొంతకాలంగా ఆందోళన చేస్తూ అధికారులకు చెబుతున్నప్పటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్ల నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి : సీఐటీయూ

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సి.హెచ్.మజుందార్ అన్నారు. సమ్మెబాట పట్టిన కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించారు. సమ్మె శిబిరం వద్ద మజుందార్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విధులలోకి హాజరయ్యేది లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి విధులకు విఘాతం కలిగి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున సమ్మె ఉధృతంకాక ముందే పర్కిరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకుడు కె.శరత్, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు రత్నం, నాని, అశోక్, మురళికృష్ణ, హరిబాబు, వెంకటేశ్వరరెడ్డి, సాంబిరెడ్డి,ప్రమీలా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీహెచ్ మజుందార్

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

కర్లపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెంలో సమ్మెట శ్రీనివాసరావురెడ్డి, హైమావతి దంపతుల పూరి గృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయింది. రెడ్డి సేవా మిత్రా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర సరుకులు, దుస్తులు, బియ్యం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నంగు గోవర్ధన్‌రెడ్డి, సమ్మెటవారిపాలెం సర్పంచ్ పిట్టు నాగార్జునరెడ్డి, ఉపసర్పంచ్ వీరారెడ్డి, అక్కల బాబురెడ్డి, శీలం రమేష్‌రెడ్డి, సమ్మెట నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యానగర్ సాల్వేషన్ ఆర్మీ చర్చి కరోన సమాజం వారు ఆదివారం ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణి చేశారు. కరోన సమాజం కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సంఘ కాపరులు మేజర్ కె.ఏసురత్నం, మేజర్ కె. రజనీలు సంఘస్తులతో కలిసి రోగుల కొరకు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సంఘ పెద్దలు, గృహసమితి సభ్యులు, లీగ్ ఆఫ్ మెర్సీవారు పాల్గొన్నారు.

సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి రచయితలు సంతాపం

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు కోట శ్రీనివాసరావు తన నటనతో అందర్ని ఆకర్షించగల గొప్ప నటుడు అని, ఆయన మరణించటం ఎంతో బాధాకరమని బాపట్ల సాహితి భారతి రచయితలు రావూరి నరసింహవర్మ, ఆదంషఫి, మర్రి మాల్యాద్రిరావు, దగ్గుమల్లి శామ్యూల్, ఎస్.కృష్ణ, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు అన్నారు. ఆయన కుటుంబానికి వారు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగరాజు హఠాన్మరణం

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం పక్కనే ఉన్న బీసీ హాస్టల్‌లో వెల్ఫేర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న దబ్బకూటి వెంకటశివనాగరాజు (56) శనివారం రాత్రి హఠాన్మరణం చెందారు. నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు సుపరిచితుడైన నాగరాజు సంక్షేమవసతి గృహంలో విద్యార్థుల సంఖ్యను పెంచటమే కాకుండా మంచి ఫలితాలు తీసుకొచ్చి పెద్దఎత్తున మన్ననలు పొందారు. ఆయన మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం ప్రకటించిన వారిలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు మారం రవికుమార్, ఎన్ఎస్‌పీ రాజు, కంకణాల రాంబాబు, గోపినాథ్ తదితరులు ఉన్నారు.



నాగరాజు (ఫైల్)



డ్రెయినేజిని ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు



రాజీవ్ గాంధీకాలనీ డ్రెయినేజిలో మురుగు నిలిచి ఉన్న చిత్రం

రాజీవ్‌గాంధీకాలనీలో కాల్వల ఆక్రమణ

● ముందుకు కదలని మురుగు

● వ్యాపిస్తున్న దోమలు...అల్లాడుతున్న ప్రజలు

● పట్టించుకోని అధికారులు

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో డ్రైనేజి సిస్టమ్ అస్తవ్యస్థంగా మారింది. వార్డులోని ఎస్టీ కాలనీ రహదారుల పక్కనే దశాబ్దాల క్రితం మీడియం, మైనర్ డ్రెయిన్‌లు నిర్మించారు. ఇటు జమ్ములపాలెం రోడ్డు పక్కనే, అటు కాలనీ చివర నిర్మించిన మైనర్ డ్రెయిన్‌ల ద్వారా మురుగునీరు ఈస్ట్ శ్యాంప్ డ్రెయిన్‌లోకి ప్రవహిస్తుంది. కాలనీలో మైనర్ డ్రెయిన్‌లు నిర్మించి వాటి మీడియం డ్రెయిన్‌లకు అనుసంధానం చేయకుండా వదిలేశారు. దీనివల్ల కాలనీలోని డ్రెయిన్‌లను కొంతమంది ఆక్రమించి కట్టడాలు చేపట్టారు. కొన్నిచోట్ల డ్రెయిన్‌లో వ్యర్థాలు తొలగించకపోవటం వల్ల మురుగు ముందుకు ప్రవహించటంలేదు. దీనివల్ల దోమల వ్యాప్తి అధికమై ప్రజలు అల్లాడిపోతున్నారు. చీకటి పడితే దోమల మోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషజ్వరాలు వ్యాపిస్తాయని ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికి మున్సిపల్ అధికారులు సమస్యపై ఏమాత్రం దృష్టి సారించటంలేదు. మైనర్ డ్రెయిన్‌లను మీడియం డ్రెయిన్‌లో కలిపి మురుగు అంతా మేజర్ డ్రెయిన్ ఈస్ట్‌శ్యాంప్‌లోకి వెళ్ళే ఏర్పాటు చేయటంలేదు. పైగా అనుసంధానం చేసిన డ్రెయిన్‌లో మురుగు ముందుకెళ్ళకుండా అనేకచోట్ల పూడ్చేశారు. కాలనీలో పారిశుధ్య పనులు నిర్వహించే వారికి అనేకసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవటంలేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతమంది ఇల్లు రోడ్డు అంచువరకు నిర్మించి డ్రైనేజి కనిపించకుండా చేశారు. వీటిపై అధికారుల దృష్టిసారించి రోడ్డుపక్కనే డ్రైనేజీలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని వెంటనే ఆధునీకరించి మురుగు సమస్య తలెత్తకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రాజీవ్ గాంధీకాలనీ రెండో లైన్‌లో పూడుకుపోయిన డ్రెయిన్‌లో ముందుకు ప్రవహించని మురుగు

సాంకేతిక విద్య అందుబాటులోకి తేవటం అభినందనీయం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రెండున్నర దశాబ్దాల క్రితమే సాంకేతిక విద్యను అందుబాటులోకి తీసుకొచ్చి వేలాది మందికి శిక్షణ ఇవ్వటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని మహాత్మాగాంధీరోడ్డులో ఎంఎస్ సాఫ్ట్‌వేర్ 25వ వార్షికోత్సవం సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఎస్ సాఫ్ట్‌వేర్ అధినేత ఎం.శేషు కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు కంప్యూటర్ విద్యను నేర్పించి వారు దేశ, విదేశాలలో వివిధ ఉద్యోగాలలో స్థిరపడేవిధంగా చేయటం సంతోషదాయకమన్నారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక సంస్థను స్థాపించి 25 సంవత్సరాలు నడపటం చాలా కష్టంతో కూడుకున్న పని అన్నారు. అనంతరం కంప్యూటర్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. సంస్థ పూర్వ విద్యార్థిని చెప్పకట్ల వైష్ణవి శిష్యబృందం ఆద్యంతం ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. నృత్యప్రదర్శన చేసిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ సాయి శ్రీనివాస్, ఆడిటర్ సుబ్రహ్మణ్యం, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, శేషుకృష్ణ, ముప్పలనేని శ్రీనివాసరావు

ముగిసిన నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్

బాపట్లరూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ టెన్నీస్ క్రికెట్ అసోసియేషన్ వారిచే ఏర్పాటు చేసిన సెకండ్ సౌత్ జోన్ నేషనల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఆదివారం విజయవంతంగా ముగిసింది. గెలుపొందిన క్రీడాకారులకు బాపట్ల నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నామన వెంకట శివన్నారాయణ, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావులు బహుమతులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేష్, నామన శ్యామ్, ఆదిశేషు, శివకుమార్ పాల్గొన్నారు.

టీటీడీ దేవస్థానానికి కూరగాయలు పంపిణీ

భట్టిప్రోలు (కొల్లూరు) జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి 10.30 టన్నుల కూరగాయలను కలావతిపుత్ర కాలంగి వీరవెంకట పాండురంగారావు, వారి సోదరి పెనుగొండ సుగుణ (భట్టిప్రోలు) వారు లారీ ద్వారా పంపారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు తూనుగుంట సాయిబాబా కూరగాయల లారీకి కొబ్బరి కాయ కొట్టి తిరుమల సాగనంపారు. దేవస్థానం మండల ధర్మచారి అరుణ కుమారి, బాలగోపాల భజన మండలి, శ్రీపద్మావతి శ్రీనివాస భజన మండలి వారు గోవిందనామాలతో కోలాట ప్రదర్శన నిర్వహిచారు. కార్యక్రమంలో భట్టిప్రోలు, అద్దెపల్లి ఆర్యవైశ్య మహిళలు పాలొన్నారు.

వైభవంగా అష్టోత్తర శత సుహాసిని పూజ

బాపట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివేకానంద కాలనీ భావదేవ నగర్‌లో ఆదివారం ప్రత్యక్ష అష్టోత్తర శతసుహాసిని పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోకకల్యాణార్థం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చెన్నైకు చెందిన శ్రీవిద్యా ఉపాసకుహనంద మండలి నుంచి గోతేటి శ్రీనివాసుల శిష్యబృందం పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు. శిఖరం ఫణిరాజశర్మ, అపర్ణ, గంటా శ్రీనివాసరావు (చిన్న), మధుసూదనరావు మిత్రబృందం నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుహాసినీలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వర్షాల కోసం గ్రామ దేవతకు జలాభిషేకం

వేమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో వర్షాలు పడి పాడి పంటలు సమృద్ధిగా ఉండే విధంగా అనుగ్రహించాలని కోరుకుంటూ వేమూరులోని గ్రామదేవత కట్లమ్మ తల్లికి గ్రామస్తులు ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. అనంతరం దూపం వేసి పసుపు కుంకాలతో అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పొంగళ్లు, పెరుగు అన్నం నివేదనలు చేశారు. కనక తప్పెట్ల మేళంతో గ్రామంలో ఊరేగింపు జరిపారు. భక్తితో నిర్వహించిన కార్యక్రమానికి ఇతర గ్రామాలలో ఉన్న ఆడపడుచులు హాజరయ్యారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు, మార్కెట్ యార్డు డైరెక్టర్ గంటా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



జలాభిషేకంలో గ్రామదేవత కట్లమ్మ తల్లి



శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

నగరంలో మెగా వైద్య శిబిరం

నగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నగరం మండల కేంద్రంలోని శ్రీవెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల ప్రాంగణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 650 మందికి పైగా ప్రజలు వైద్యసేవలు పొందారు. వారికి వైద్యపరీక్షలు నిర్వహించి తగిన మందులు ఉచితంగా అందజేశారు. శిబిరంలో 10 మంది అనుభవజ్ఞులైన డాక్టర్లతో పాటు 220 మంది వైద్య సిబ్బంది సేవలందించారు. శిబిరాన్ని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ సందర్శించి ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సామాజిక బాధ్యతలో భాగంగా చేస్తున్న ఈ సేవలు ప్రశంసనీయం అని అన్నారు అనంతరం డాక్టర్ వై.కార్తీక్‌చౌదరి మాట్లాడుతూ శిబిరంలో సుమారు 35 మంది గుండెకు సంబంధించి, 20 మంది పెద్దపేగు, 20 మంది మోకాలు నొప్పుల సర్జరీకి మెరుగైన వైద్యం కోసం హాస్పటల్‌కి రమ్మని సూచించామని తెలిపారు. వీరికి ఆరోగ్యశ్రీ ద్వారా గాని లేదా తక్కువ ఖర్చులో వైద్యం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి, సంగం డెయిరీ డైరెక్టర్ ఎన్‌వీకే ప్రసాద్, లుక్కాగుడారంకయ్య, మునాఫ్, చింతారావు తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురవుతున్న కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రైతుల సమస్యకు స్పందించిన ఎమ్మెల్యే

● కాల్వ కట్టను పరిశీలించిన ఆనందబాబు

వేమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలి పాలెం గ్రామంలో ఇటీవల కొమ్ము కాల్వ కట్టను ఆక్రమించుకుని రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు స్థానికులు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటికే కాల్వను పూడ్చి వేసి రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటున్నారని, దీనివల్ల సాగు పొలాల నుంచి వచ్చే మురుగునీరు ముందుకు నడిచే పరిస్థితి లేకుండా పోతుందని స్థానిక రైతులు కొందరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రైతులతో కలిసి ఆదివారం కొమ్ము కాల్వ కట్టను పరిశీలించారు. కాళీకృష్ణ గుడి నుండి శివ మందిరం వరకు కాల్వ కట్టబారు రోడ్డు వేసేందుకు కాల్వను పూడ్చివేస్తున్న దుస్థితిని గుర్తించారు. తక్షణమే గతంలో ఉన్న పరిస్థితికి అనుగుణంగా కాల్వ తవ్వకం జరిపి రైతులకు సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. సంబంధించిన చర్యలు తీసుకుంటున్న వ్యక్తులు కాల్వ తవ్వకాలు చేసి రైతులకు సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం


రేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ స్కీమ్ ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈఈ డి.శ్యామ్‌సుధాకర్‌బాబు తెలిపారు. అరవపల్లిరోడ్డు, పెనుమూడిరోడ్డు, కోటసెంటర్, అంకమ్మచెట్టు సెంటర్, గూనివారిపాలెం ఏరియా, చిన్నఅరవపల్లిలోఅంతరాయం ఏర్పడుతుందన్నారు.

కావూరు సబ్‌స్టేషన్ పరిధిలో..

చెరుకుపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కావూరు సబ్‌స్టేషన్ పరిధిలోని నడింపల్లి ఫీడర్, గూడవల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని కనగాల ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా నడింపల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి, మత్తివారిపాలెం, కనగాల గ్రామాలకు సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏడీఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధ్యాత్మిక గురువుకు సన్మానం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 13 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవ్యం అంటే కేవలం సంఘం మాత్రమే కాకుండా సాక్ష్యంగా నిలవాలని డాక్టర్ లూథర్‌రిచర్డ్ సన్ అన్నారు. భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయానికి ఆహ్వానించిన వేదాంత కళాశాల విశ్రాంత అధ్యాపకులు రిచర్డ్ సన్ ఆదివారం వాక్యోపదేశం చేశారు. సంఘ పెద్దలు, స్త్రీల సమాజం వారు శాలువా, జ్ఞాపికలతో దంపతులను సన్మానించారు.



ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం

● ఎమ్మెల్యే ఆనందబాబు



పెరవలిపాలెంలో వృద్ధురాలిని పలకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలన ద్వారా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల కన్నా ఎక్కువగానే ప్రజలకు సహకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని పెరవలి, పెరవలిపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెరవలిలో యార్లగడ్డ రత్తయ్య దంపతులు తమకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించి సహకరించాలని కోరారు. వారికి సంబంధించిన ఆధార్ కార్డులు పరిశీలించి తక్షణమే సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పెరవలిపాలెంలో గ్రామస్థులు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న పాత ట్యాంక్ దెబ్బతినడం వల్ల కొత్త ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తిరిగి నిర్మాణం చేసే వరకు నీటి సమస్య లేకుండా పాత ట్యాంకు ద్వారా నీరు అందించేందుకు పైపులైను మరమ్మతులు చేయించి తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దండే వెంకట సుబ్బారావు, బీసీ సంఘం నాయకుడు శివలింగప్రసాద్, పెరవలి సొసైటీ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగయ్య, ప్రసాదం బసవయ్య, కామేశ్వరరావు, మేరివర్ధిని, దాది లక్ష్మణ్, గణాది నాగేశ్వరరావు, కంచి సీతారామయ్య, శివకృష్ణ, దాసరి లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ నిర్మాణానికి నేడు శంకుస్థాపన

భట్టిప్రోలు (కొల్లూరు) జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన భట్టిప్రోలులో సోమవారం అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. భట్టిప్రోలు బౌద్ధ స్థూపం ఎదురుగా ఖాళీగా ఉన్న స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. సాయంత్రం నాలుగు గంటలకు మండల పరిధిలోని ఐలవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని

రేపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. పట్టణంలోని 9, 11, 12వ వార్డులలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాల వివరాలు తెలియపరుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.6 కోట్లు మంజూరు చేశారని, ప్రజలకు తాగునీరు సమృద్ధిగా అందించేందుకు నూతన పైప్‌లైన్లు ఏర్పాటు, డ్రెయిన్లు అభివృద్ధి, లోతట్టు ప్రాంతాల్లో సీసీ రోడ్లు అభివృద్ధి చేయనున్నారన్నారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాడివాక శ్రీనివాసరావు పార్కులో యువకుల కోసం ఓపెన్ జిమ్మును ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు దాసరి నాగరాజు, గోగినేని పట్టాభిరామారావు, ఆలపాటి వేణుగోపాలరావు, గూడవల్లి బాబు, డొక్కు బుజ్జి, నల్లూరు అజయ్‌కుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, తడికమళ్ళ బాలు, దేవగిరి రంగా, షేక్ ఖాదర్‌బాషా, ల్యాబ్ కిషోర్, ఆగస్య తాడిపర్తి మల్లికార్జున్‌రావు, డొక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పట్టణంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

పూడివాడ సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడిగా మోర్ల

నగరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పూడివాడ సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడిగా మోర్ల శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం మండలం రైతులకు ఆర్థికంగా అండదండగా ఉంటూ సకాలంలో వారికి కావాల్సిన రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. మాజీ ఎంపీపీ విచారపువీరయ్య మాట్లాడుతూ రైతులు బ్లాకులో ఎరువులు కొనలేకపోతున్నారని సొసైటీల ద్వారా రైతులు కావాల్సిన ఎరువులు అందుబాటులోకి తేవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీకి ఏకగ్రీవంగా ఎన్నికైన మోర్ల శ్రీనివాసరావు రైతులకు కావలసిన రుణాలు అందించి ఆదుకోవాలని అన్నారు. టీడీపీ నాయకుడు లుక్కా గుడారంకయ్య మాట్లాడుతూ రుణాలు పొందిన రైతులు సకాలంలో చెల్లిస్తే సొసైటీలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగమణి, పూర్ణయ్య, చింతల వీరయ్య, సెక్రటరీ బుజ్జి, మట్ట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మోర్ల శ్రీనివాసరావును సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ వీరయ్య తదితరులు